
# బ్లాక్ స్పైరల్ నోట్‌బుక్

ఉదయాలు అన్నీ గుర్తుకొస్తాయి. మలక్‌పేట్ టి.వి. టవర్ ఎదురుగా పురాతనమైన హవేలీబీ స్టోర్‌రూమ్ లాంటి ఒక గది.



నీళ్ల కోసం, పాలకోసం నేను ముందే లేస్తాను. నువ్వు ఇంకా నిదురపోతూనే వుంటావు.

నేను మెల్లగా నీ ప్రక్కకు చేరి నిద్ర నటిస్తూ, నీ మృదువైన శరీరం చప్పుళ్లు నాకు వినిపిస్తూనే వుంటాయి. ఆ శ్వాసలో నుంచి పరిమళమైన జ్ఞాపకం ఏదో ఒక్కసారి కదిలి, నువ్వు ఒత్తిగిలి నావైపుకు ఒరిగి నా చెయ్యో, భుజమో నీకు తగిలి నువ్వు మరికాస్త నావైపు జరిగి పూలమొక్క ఏదో నన్ను అల్లుకొన్నట్లుగా, నువ్వు నిద్రపోతూనే వుంటావు. నీ స్పర్శలో నేను పోయమ్‌ను అవుతాను. పోయమ్‌నో, పాటనో హమ్ చేస్తుండగా నువ్వు కళ్లు తెరుస్తావు.

“శివకాంతా, మనము వుండే ఈ అపార్టుమెంట్ ఒక వింత ప్రపంచం. సాఫ్ట్‌వేర్ పిల్లలు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, మనలాగే యూనివర్సిటీల నుంచి వచ్చి గ్రూప్-1 పరీక్షకు ప్రిపేర్ అవుతున్న వాళ్లు, ఇంజనీర్లు. ఇంటినిండా కోచింగ్ సెంటర్ వాళ్లు ఇచ్చిన మెటీరియల్, పాత క్వశ్చన్ పేపర్లు, పెళ్లయి ఆరు నెలలు అయిన మనం ఇంకా యూనివర్సిటీ జీవితాన్నే గడుపుతున్నట్లు వుంది.

ఒకరోజు నువ్వు అడిగావు, దళితుడిగా పుట్టడంలోనే హింస వుందా అని. ఎలాంటి హింస! నేనేమీ మాట్లాడలేదు. ఒక భౌతిక భావాన్ని ఎట్లా వివరించడం, ఒక అమూర్తమైన భావాన్ని ఎట్లా మాటల్లోకి అనువదించడం. ఇది హైదరాబాదు. మనం వుండేది మలక్‌పేట లోపలి సందులో ఒక పురాతనమైన అపార్టుమెంటు. అపార్టుమెంటు నుండి చూస్తే రోడ్డు. రోడ్డు పైన ప్రయాణిస్తున్న వాహనాలు. ఇక్కడ అంతా ప్రశాంతంగా ఉన్నట్లు వుంటుంది. గంభీరమైన ముఖ కవచాన్ని తొడుగుకోవడం ఇక్కడి అవసరం. ఇది హైదరాబాదు.

మనం కొత్త పాత్రకు సిద్ధమైన వేషధారులం. యూనివర్సిటీలో వున్నప్పుడు నేను దళిత విద్యార్థిని. నువ్వు బహుజన అమ్మాయివి. మనం వెంట తెచ్చుకున్న మూలాల్లోంచి యూనివర్సిటీ ఒక్కోసారి

వెంటాడే ఆయుధంగానూ, కనబడే హింసలాను, మన నుంచి లాగి వేయబడ్డ ఏదో జీవితంలా అనిపించేది. శివకాంతా, నీకు గుర్తుందా, నువ్వు సెంగార్ రాసిన The Country గురించి చెప్తావు. నా రూమ్‌కి వస్తే ఇలాంటి ఎన్నో అనుభవాలు, నా టేబుల్ పైన ఏదో ఒక కవిత్వం పుస్తకం తెరువబడి, రూమ్‌లోకి వస్తే కవిత్వం వాసన వచ్చేది. ఇటు శివారెడ్డి, అటు షాజహానా. ముస్లిం మైనార్టీ కవిత్వం, నీకు ఎంతో ఇష్టమైన కవిత్వం.

కవిత్వమే కాకుండా నీ చిన్ననాటి జ్ఞాపకాలన్నీ కథలు కథలుగా వినిపిస్తావు. వాటిల్లో ఒక గొప్ప కథకుడి నైపుణ్యం వుంటుంది. నువ్వు చెప్పే అనుభవాలు, ముచ్చట్లు, పద్మశాలీల జీవితం ఒక మనోహర మైన నవలలా వినిపిస్తావు. నీకు కొన్ని ప్రత్యేకమైన ఇష్టాలు, అయిష్టాలు వుంటాయి. ఆల్కాహాలు, సిగరెట్లు నువ్వు ఎక్కువగా ద్వేషించే విషయాలు, నేను నా జీవితంలోని కబుర్లు బయటకి తెస్తాను. చాలా ఏళ్ల క్రితంనాటి మధ్యాహ్నం గుర్తుకు వస్తుంది. చర్చి గంటలు శ్రావ్యమైన సువార్తగానం అట్లా వినిపిస్తూ వుండగానే హఠాత్తుగా ఒక దొమ్మిలాంటి, దాడి లాంటి దృశ్యం. నా కళ్ల ముందు కత్తులు, కొడవళ్లు, ఇనుపరాడ్లతో 'నరకండి, చంపండి' అంటూ అరుపులు వినిపిస్తూ వుంటాయి. నీకు గుడికి వెళ్లడం, శుక్రవారాలు ఉపవాసాలు ఉండడం ఎంతో ఇష్టం. నాకు ఆదివారాలు తల్చుకుంటే భయం. పాలస్తీనా, చోమ్‌స్కీ, ఎడ్వర్డ్ సయ్యద్, అరుంధతి రాయ్ మనకు ప్రియమైన విషయాలు. ఇంటర్నెట్ ఎదురుగా కూర్చొని ప్రపంచంలో జరిగే ఒంటరి సమూహాలు, వాటి పోరాటాలు అన్నీ ఇష్టంగా చూస్తాం. చెగువెరా మోటారు సైకిల్ యాత్రలు, తెలంగాణా పోరాటాలు యూనివర్సిటీ రోజుల్లో మనల్ని కలిపినవి ఇవేనేమో. ఇప్పుడు రూమ్‌లో పాత క్వశ్చన్ పేపర్లు తప్ప మరే వింతలో విశేషాలో కనపడవు. అరిగిపోయిన రాజ్యాంగం, పనికిరాని సోషియాలజీ పాఠాలు!

శివకాంతా, నా జీవితంలోని సంవత్సరాలు అన్నీ నీ ముందు పరుస్తాను. అవి ఏవీ రంగుల కలలు కావు. చాలావరకు నలుపు-తెలుపు దృశ్యాలు. కొన్ని సంవత్సరాలు చీకటిమరకల్లా- ఆ కొన్ని సంవత్సరాలు నేను మర్చిపోతాను. వాటిని గుర్తు చేసుకొని లేదా అవి గుర్తుకొచ్చిన సమయాల్లో భరింపలేని ఊపిరాడనితనంతో గిలగిలలాడుతాను. మన కబుర్ల నుండి ఆ సంవత్సరాలన్నీ జారి పోయినట్లుగా, నా ముఖం రాతిసంచిలా బిగుసుకుపోతుంది. ఆ సంవత్సరాల్ని చెరిపి వేసినట్లుగా నా కళ్లు ఖాళీగా మారిపోతాయి. గదులన్నీ మూసి తాళాలు వేసిన ఇల్లులా మారిపోతాను. మనం ఇద్దరం కలసి చూసిన ఇరానీ సినిమాలోని హీరోయిన్‌లా నా జీవితం నుండి కొన్ని రోజులు, ముఖ్యంగా, మన యూనివర్సిటీ రోజులలోని చివరి మూడు నెలలు మిస్ అవుతాయి. ఎంత గుర్తు చేసుకున్నా ఆ రోజులు వెలికిరావు.

శివకాంతా, ఫెమినిస్ట్ స్టడీస్, మైనారిటీ హక్కులు, ఇరానీ సినిమాలు, చిన్న చిన్న షార్ట్ ఫిల్మ్స్ తీయడం నీకు ఇష్టమైన విషయాలు. సీఫెల్, ఉస్మానియాలు మనం ఇష్టంగా తిరిగే ప్రదేశాలు. అయితే మనం నిద్రపోయే సమయాలు ఒక కథలా అవుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు.

“రాత్రిపూట నిద్రలో అరుస్తావు. కేకలు వేస్తావు, ఎవరితోనో మాట్లాడుతావు. ఆ అరుపులు కేకలు వినలేకపోతున్నాను. రాత్రంతా నీ వైపే చూస్తూ భయంతో నిద్రపట్టడంలేదు. పీడకలలేమో అను కుంటే రాత్రి పొడవునా అవే అరుపులు. అవే భీకరమైన మూలుగులు, అని అంటావు. నాకేమీ గుర్తుండదు. నువ్వు చెప్తుంటే ఆశ్చర్యంగా వుంది అంటాను సమాధానంగా. ఈమధ్య మన రాత్రులన్నీ అరుపుల్లా, భయంతో వేసే మూలుగుల్లా మారిపోయాయి. నిన్ను నిద్రలేపి, నీ తల నిమిరి నిద్రపుచ్చి ఆ తరువాతనే నేను నిద్రపోతాను.

అది రాత్రి మూడు గంటలో, నాలుగు గంటలేమో. నీ భయాలు ఏమిటో, నాకు అర్థం కావు, అంటావు నీవు.

భయాలు నన్ను నిత్యం వెంటాడుతూనే వుంటాయి. ఊహరాని వయస్సులో ఒక రాత్రిపూట వాడలోని ఇళ్లన్నీ తగలబడి చేతికి అందిన వస్తువుల్ని, పిల్లలందర్ని భుజాన వేసుకుని అమ్మ అరుచుకుంటూ పరిగెత్తిన ఒక దృశ్యం నన్ను వెంటాడుతుంది. వరిపొలాల మధ్య తమ్ముడి శవం నన్ను భయపెడుతూనే వుంటుంది. కాలేజీ మొదటి రోజు క్లాస్‌రూమ్‌లో జరిగిన అవమానం కూడా నాకు గుర్తుంటూనే వుంటుంది. కాస్త వయస్సు పెరిగి యూనివర్సిటీకి వచ్చినాక అంబేద్కరిస్ట్ స్టడీ గ్రూప్‌లో చేరినాక భయాలన్నీ ఒక్కొక్కటి బయటకి తీసి ఎనలైజ్ చేసుకుంటూండగానే, R మరణం ఒక షాక్‌లా తగిలింది.

R మరణానికి ముందు వెనుక సంగతులన్ని నన్ను భయ భ్రాంతులకు గురి చేస్తూనే వుంటాయి. R మరణించిన మూడవరోజు హాస్టల్‌పైన దాడి జరిగింది. ఎందుకో నన్ను మాత్రం వదిలేసి నా రూమ్‌మేట్‌ని బరబరా లాక్కుంటూ క్రిందకు తీసుకువెళ్లారు. క్రిందొక సమూహం, వారితో కలసిపోయిన మరో సమూహం పదిమందిని ఇలా లాక్కుంటూ వచ్చి, వ్యాన్‌లోకి విసిరేశారు. నేను గట్టిగా అరవాలని చూశాను. ఎవరో రెండు చేతులతో నా గొంతు బిగించినట్లు, క్యారిడార్‌లో నిలబడి చూస్తున్నాను. క్రిందకి వెళ్లాలని ప్రయత్నించినా నా రెండు కాళ్లను ఎవరో తాళ్లతో బిగించి కట్టినట్టుగా. క్రింద కేకలు అరుపులు, నేను అట్లాగనే నిలబడిపోయాను. చాలా సేపటికి రెండు మూడు వ్యాన్‌లు కదిలి వెళ్లిన చప్పుడు, వ్యాన్‌ల నుంచి అరుపులు, కేకలు, జాగ్రత్త అంటూ హెచ్చరికలు. నేనట్లా క్యారిడార్‌లోనే నిలబడి పోయాను.

రెండు రోజుల తరువాత అవయవాల గుట్టల్లా పదకొండు మందిని తెచ్చి హాస్టల్ బయట పడవేశారు. పన్నెండోవాడు ఏమైనట్లు?

మరణపు వాసన నా ముక్కు పుటల్లో. పన్నెండోవాడు ఫిలిప్స్. వారం గడిచినా అతని గురించి కబురు లేదు. ఫిలిప్స్ మరణం నాకు పదే పదే గుర్తుకు వస్తుంది. అతన్ని మిస్సింగ్ కేసుగానే పోలీసులు చెప్తారు. తిరిగి వస్తాడు అనే ఒక ఆశ. ఒక రాత్రిపూట ఇంటర్నెట్‌లో వచ్చిన ఫిలిప్స్ శవం ఫోటోతోటి నా ఆశ గుప్పెట్లో పక్షిలా ఎగిరిపోయింది. తెరలు తెరలుగా భయంలాంటిది ఏదో నా చుట్టూ అల్లుకుపోయి, నిద్రపోతున్న నన్ను ఎవరో బరబరా లాక్కుని లాఠీలతో నన్ను హింసించి, చంపి హాస్టల్ మెట్లపైకి విసిరి వేసినట్లు.

ఫిలిప్స్ చనిపోయాడు. నేను బ్రతికే వున్నాను. ఆ రాత్రి వేకువ జామున నేను ఒక అరుపునో ప్రతిఘటననో చెయ్యలేకపోయాను అనేది నిజం. నా కాళ్లకు ఎవరో మేకులు దిగగొట్టి నా నోటి చుట్టూ ప్లాస్టర్ బిగించిబీ

మనం పెళ్లి చేసుకున్న ఆరు నెలల తరువాత ఈ అపార్టు మెంటులోకి వచ్చిన మూడు నెలల తరువాత ఆ శనివారం ఒక దుస్వప్నంలా మన మధ్యలోకి వచ్చింది. అపార్టుమెంటుకి సరిగ్గా రెండు వందల అడుగుల దూరంలో ఒక శిక్షణ శిబిరం. కార్యకర్తల డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, నినాదాలు, జెండాలు, ప్రదర్శనలు. చంపుతాం, నరుకుతాం అంటూ హెచ్చరికలు. వీధి పొడవునా, రాత్రి పొడవునా ఒక కవాతు జరుగుతూనే వుంది. మన అపార్టుమెంటుకి వున్న ఒకే ఒక్క కిటికీలో నుండి ఆ అరుపులు వినిపిస్తుంటాయి. ఆ గోడకి కరుచుకుని భయపు సముద్రంలోకి మునగకుండా వుండాలని, కిటికీలు మూసి తలుపులు మూసి... కాని ఆ అరుపులు సమస్తాన్నీ చీల్చుకొని నన్ను చుట్టుముడుతూనే వున్నాయి. తెలియని భయం ఏదో నా లోపలికి ప్రవహిస్తుంది. ఒక పుస్తకాన్ని తీసుకొని చదవడానికి ప్రయత్నిస్తాను. సాధ్యం కాదు. శివకాంతా, ఒకసారి నువ్వు ఇంకా కోచింగ్ సెంటర్ నుండి రాలేదు, నిన్ను కూడా అవయవాల గుట్టలా

విసిరిపారేస్తారేమోనని భయం అప్పటికి నాలో కలిగింది. లేచి క్రిందకు వెళ్లి నువ్వు వస్తావేమో చూడాలని, కానీ నా కాళ్లను ఎవరో తాళ్లతో కట్టివేసి, నా లోపల నుంచి భయం ఏదో శరీరం అంతా వ్యాపించి, నేను అట్లా భయం అనే వ్యాధితో అచేతనంగా... రాత్రి ఎపుడో 10.30కి వచ్చావు. చెమటలతో తడిసి శరీరమంతా బిగుసుకుపోయిన నన్ను చూసి కంగారుపడ్డావు. నేను వాళ్లు వెళ్లిపోయారా, వెళ్లిపోయారా అని కలవరిస్తున్నాను. ఎవరు వాళ్లు? ఎవరు వాళ్లు? అంటున్నావు నువ్వు. మనల్ని చంపేవాళ్లు. ఈ భూమి పై మన ఉనికిని సహించలేని వాళ్లు. పారిపోదాం, పారిపోదాం అంటూ నేను అరుస్తునే వున్నాను.

నవంబరు నెలలో అనుకోని వర్షాలు వచ్చాయి. ఇప్పుడు శనివారాలు ఆదివారాలు నేను అపార్టుమెంటు దాటి బయటకు రావడం లేదు. కూరగాయలు, పాలు అంటూ వర్షంలో ఈదుకుంటూ నువ్వు వెళ్తుంటావు, నేను మన కిటికీలో నుండి చూస్తూనే వుంటాను. శనివారం సాయంకాలాలు మామూలు వాన మబ్బుతో తోడుగా ఇంకా ఏవో నల్లమబ్బులు మన వీధి పొడవునా ముసిరినట్లు అనిపిస్తాయి. అరుపులు, కేకలు, కరకు పాదాలు పరిగెత్తుతున్న చప్పుళ్లు, లాఠీలు విరుగుతున్న చప్పుళ్లు, పెళ్లుమని చిట్లుతున్న శిరస్సులు, శరీరావ యవాలు, పది దాటుతున్నా నువ్వు ఇంకా రానేలేదు. రావద్దు, రావద్దు ఈ రాత్రికి కోచింగ్ సెంటర్‌లోనే వుండిపో అనే SMS పంపుతాను. నువ్వేమో వానలో ఈదుకుంటూ వస్తున్న నల్లగులాబీలా, ఇంట్లోకి వస్తావు. శనివారాలు రాత్రులు నేను నిద్రపోకుండా వుండడానికి ప్రయత్నిస్తాను. నిద్రపోతే భీకరమైన అరుపులు కలలు నీకు డిస్ట్రబెన్స్ కలగకూడదని. కాని నిద్రో, భయమో నన్ను ఆవహించి, రాత్రంతా భయపు అరుపులు, కేకలు, మూలుగులు. పొద్దున్నే ఎర్రబడ్డ నిద్రలేని నీ కళ్లను చూసి నేను గిల్టీగా ఫీలవుతాను.

డిశంబరు నెల. పరీక్షలు ఇంకా మూడు నెలలు ఉన్నాయి. నువ్వు మునుపటిలాగే సైకియాట్రిస్ట్‌ని కలుద్దాం అని సలహా ఇచ్చావు.

నేను మొండికి వేశాను. ఇదేమీ మానసిక వ్యాధి కాదు అని, సహజంగా వచ్చే పీడకల అని బుకాయించాను. డిశంబరు ఐదున నువ్వు కొన్ని పుస్తకాలు, బట్టలు సర్దుకొని మీ పుట్టింటికి వెళ్లావు. శివకాంతా, మన కథలో ఇది నేను ఊహించని మలుపు.

## 2

నా యూనివర్సిటీ రోజులు ఒక కథలాగో చరిత్రలాగో సాగాయి. వెంట మోసుకొచ్చిన అనుభవాలో, అవమానాలో, యూనివర్సిటీ రోడ్ల పై మొదట్లో భయం భయంగా అడుగులు వేసేవాడిని. ఒకసారి హాస్టల్ ముందు అంబేద్కర్ జయంతి ఊరేగింపు చూసినాక నా నడకలో ఊపు, నా యూనివర్సిటీ జీవితానికి ఒక ఉద్దీపన దొరికాయి. అంబేద్కరిస్ట్ స్టడీ సెంటర్, యూనివర్సిటీ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. సమస్త అవమానాలను, సంఘటనలను చర్చించుకోవడం మొదలుపెట్టాం. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న వందలాది అస్థిత్వ పోరాటాలను మేము తెల్సుకుంటున్నాం. అంబేద్కర్ రచనలు అన్నీ మళ్లీ కొత్తగా చదవడం మొదలుపెట్టాం. శివకాంతా, నీతో పరిచయం అయ్యింది కూడా అప్పుడే. బహుజనతత్వం అంటే ఏంటో నాకు ఒక కొత్త నిర్వచనం తెలిసింది.

శివకాంతా, నీకు గుర్తుంది కదా, ఆ రోజు హాస్టల్ మెట్లపైన మనం ఎంతగా పోట్లాడుకున్నామో... అంబేద్కర్, మార్క్స్ ఇద్దరూ మన సమాజానికి కావాలని నువ్వు, లేదు అన్నీ అంబేద్కర్ మార్గంలోనే ఉన్నాయి అని నేను... రాత్రి పది గంటలయినా మన పోట్లాట ముగియలేదు. మరుసటిరోజు నీ లాప్‌టాప్‌లో స్పానిష్ సినిమా ఎల్ వైయిలిన్ చూపించావు. రెండు గంటల సినిమా నన్ను ఎంతగానో కదిలించింది. ప్రాంతం ఏదైనా, బహుశా విముక్తి పోరాటాలు అన్నీ ఒకలాగే వుంటాయేమో. అంబేద్కరిస్ట్ స్టడీ సెంటర్ మిలిటెంట్‌గా మారుతుందని ఒక ప్రచారం వచ్చింది క్యాంపస్‌లో. ఎక్కడ నల్లజెండ

ఎగురవేసినా, ఏ పోస్టర్, ఏ బ్యానర్ చిరిగిపోయినా ASCనే చేసింది అనేవారు. ఇతర యూనివర్సిటీల నుంచి మిత్రులు రావటం, లైబ్రరీల ముందు ఖాళీ ప్రదేశంలో కూర్చొని కబుర్లు చెప్పుకోవడం రాత్రి రెండు గంటల వరకు కబుర్లు సాగేవి.

ఆగస్ట్ చివరి వారంలో జరిగిన ఒక్కొక్క సంఘటన మనం తరచూ చూసే ఆర్ట్ ఫిల్మ్‌లోలాగా, స్కాలర్‌షిప్స్ ఆగిపోవటం, హాస్టల్ నుంచి బహిష్కరించబడటం సరిగ్గా అప్పుడే R మరణం. నక్షత్రాలు అన్నీ రాలిపోయే వయొలిన్ తీగలు. అన్నీ తెగిపోయి, కలలన్నీ తగల బడుతున్న రంగుల బొమ్మలై... నాకది ఊహించని షాక్. R మరణానికి ముందున్న నేను ఇప్పుడు లేను. క్రొత్తగా, భయంగా, మరణం వెంట తరుముతున్న వాడిలా, కసిగా, కోపంగా, నన్ను నేను తగులబెట్టుకోవా లనే కాంక్షతో ఇప్పుడు యూనివర్సిటీ రోడ్లపై నేను నిప్పుల మనిషిలా నడుస్తున్నాను. అప్పుడే పన్నెండోవాడు ఫిలిప్స్ అదృశ్యం అవ్వటం జరిగింది.

శివకాంతా, ఫ్లాస్క్ నిండా టీ నింపుకుని రెండు బిస్కట్ ప్యాకెట్స్ తీసుకుని నువ్వు నా గదికి వచ్చావు గుర్తుందా, అప్పటికి నేను వేరే G.S. (జీవ సుందరాన్ని). నీకు తెలిసిన సుందరాన్ని కాదు, లోపల శవం ఏదో కదులుతున్న మనిషిలా నేను, నువ్వు కప్పు టీతో నా ఎదురుగా కూర్చుని ఒక ఆశలా... నువ్వు చెప్పేవి నాకు వినబడడం లేదు. నా లోపల అరుపులు, కేకలు, దొమ్మీలు, నేను ఒక మినియే చర్ యుద్ధభూమిలా ఉన్నాను. నువ్వు నా తల నిమిరి నా జేబులో కొంత డబ్బు కుక్కి ఒక ఆశను నాలో నాటడానికి ప్రయత్నించావు. ఆ రాత్రి నువ్వు వెళ్లినాక, తరువాత నేను రూమ్‌లో నుండి బయటకు పరిగెత్తాను. ఒక డబ్బాలో నల్లటి పెయింట్ పోసుకుని హాస్టల్ చుట్టూ తిరిగాను.

R.R.R. అంటూ హాస్టల్ గోడలు నిండా మనిషి ఎత్తు Rని రాసుకుంటూ వెళ్లాను. వేకువజామున నాలుగు గంటలకు ఎప్పుడో

రూమ్‌కి వచ్చాను. పొద్దునే తొమ్మిది గంటలకు స్నానం చేసి పూనికతో లైబ్రరీకి పరిగెత్తాను. లైబ్రరీ అంతా నిర్మానుష్యంగా వుంది. లైబ్రేరి యన్ ఒక్కడే నిద్ర చూపులతో కౌంటర్‌లో ఉన్నాడు. రాజనీతికి సంబంధించిన పుస్తకాలన్నీ తెచ్చి ముందు వేసుకున్నాను, ముందుగా మార్క్స్, ఎంగిల్స్ రచనలు తెచ్చుకున్నాను. చదువుతూ చదువుతూ పుస్తకం మార్జిన్‌లో R మరణానికి మీ దగ్గర ఏమైన జవాబు ఉందా అంటూ రాశాను. మరో పుస్తకం తీశాను. కులం అనే భావనకు మీ ఎనాలిసిస్ ఏమిటి? అట్లా పుస్తకాల మార్జిన్స్ అన్నింటిలోనూ రాసు కుంటూ పోయాను. అవన్నీ ప్రశ్నలే. రెండు గంటలకు సాహిత్యపు పుస్తకాల వైపునకు వచ్చాను. ఒక్కొక్క పుస్తకాన్ని చదవకుండానే నల్ల సిరా పెన్నుతో R మరణము లేదా మరణాలు వీటి గురించి ఎప్పుడు రాస్తారు అంటూ ఆ పుస్తకాల మార్జిన్‌పై రాసుకుంటూ వెళ్లాను. సరిగ్గా సాయంకలం నాలుగు గంటల వేళ నా భుజంపైన, మెడపైన ఒక బలమైన చెయ్యి. ఇద్దరు కానిస్టేబుల్స్ 'పద బయటకు' అంటూ ముందుకు తోశారు. టేబుల్స్ పైన గుట్టలు గుట్టలుగా పుస్తకాలు, వాటిపైన నల్లని అక్షరాలు... వాటిని దాటుకుంటూ లైబ్రేరియన్ కౌంటర్ దగ్గరకు నడిచాను.

"పుస్తకాల మధ్య కాగితాలు చించేస్తున్నావు అనీ, పుస్తకాల మార్జిన్స్‌పై ఏవేవో రాస్తున్నావు అనీ నీ మీద కంప్లయింట్," అన్నాడు లైబ్రేరియన్.

"పుస్తకాలు అంటే నాకు ప్రాణం. నేను వాటిని ఎందుకు చించుతాను? నేను ఆ పుస్తకాల రచయితలతో మాట్లాడుతున్నాను. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు కావాలి నాకు," అంటూ గొంతు పెంచి అరిచాను. కానిస్టేబుల్ నా మెడను పట్టుకొని ముందుకు తోశాడు. మెట్లపైన జారిపడ్డాను.

"వీడు చించేసిన కాగితాలు" అంటూ నాపైకి కొన్ని చించిన పేజీలు విసిరేశాడు లైబ్రేరియన్. అవన్నీ అంబేద్కర్ రచనలలో నుంచి చించిన కాగితాలు.

శివకాంతా, ఆ రోజు రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. లైబ్రరీ పుస్తకాలని ధ్వంసం చేసినందుకు నన్ను జైలులో పెట్టారు. ఆ సాయంకాలం నువ్వూ, పదిమంది మిత్రులు నాకోసం స్టేషన్ బయట నినాదాలు చేశారు. రాత్రి పదకొండు గంటలకు స్టేషన్‌లో నుండి నన్ను బయటకు విసిరివేశారు. మిత్రులందరూ వెళ్లిపోయాక యూనివర్సిటీ గేటు బయట ఉన్న క్యాంటీన్‌లో మనిద్దరం గుడ్డి వెలుతురులో ఒక పరోటాను రెండు కప్పుల చాయ్‌ని పంచుకోవటం గుర్తుందా! ఏం జరిగింది? అన్నావు నువ్వు దీర్ఘంగా నిట్టూర్చి. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు అడిగాను శివకాంతా. జ్ఞానాన్ని, పుస్తకాన్ని నా నుంచి దూరం చేయటానికి ఒక కుట్ర జరుగుతోంది నీకు తెలుసా. యూనివర్సిటీలోని అన్ని లైబ్రరీలలోకి నా ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నువ్వు ఎప్పటిలాగే నా తల నిమిరి ఒక ఆశను నాలో నింపాలని ప్రయత్నించావు. ఆ మరుసటిరోజు ఉదయం తెలియని ఉన్మాదం ఏదో నాలో చుట్టుముట్టి నా రూమ్‌లో ఉన్న ఇరవై ముప్పై లైబ్రరీ పుస్తకాలని సంచుల్లో వేసుకొని లైబ్రరీ ముందుకు తీసుకొచ్చాను. వాటిని లైబ్రేరియన్ వైపు విసిరివేసి నీ లైబ్రరీని నేను బహిష్కరిస్తున్నాను అంటూ కోపంగా అరిచాను. పదిగంటల వేళ ఒక పూనికతో యూనివర్సిటీ గేట్ నుంచి బయటపడ్డాను.

సిటీబస్ ఎక్కి కోటి సిటీ సెంట్రల్ లైబ్రరీ వైపు వెళ్లాను. లైబ్రరీ ముందు ఇద్దరు సెంట్రీలు, నీకు ఇందులోకి ప్రవేశం లేదు అన్నట్లుగా చూశారు. వెనక్కు మళ్లి ఇంకో బస్ ఎక్కి ఇండో అమెరికన్ లైబ్రరీకి వెళ్లాను, అక్కడా ఇదే పరిస్థితి. అన్ని లైబ్రరీల నుంచి నన్ను బహిష్క

రించినట్లుగా. పుస్తకం లేకపోతే నేను ఏమైపోవాలి. తార్నాకలో బస్ ఎక్కి కూర్చున్నాకా చిన్న చిన్న సమూహాలుగా స్కూలు పిల్లలు బస్‌లో ఎక్కుతున్నారు. పిల్లల భుజాలకు తగిలించుకున్న సంచుల్లో నుండి పుస్తకాలు నావైపు తొంగి చూస్తున్నాయి. కండక్టర్ టికెట్ కోసం డబ్బులు అడిగాడు. జేబులు అన్నీ ఖాళీగా వున్నాయి. డబ్బులు లేవంటూ నిర్లిప్తంగా చెప్పాను, కండక్టర్ నావైపు చూచి, అయితే దిగిపో అన్నట్లు చూశాడు. నెక్స్ట్ స్టేజీలో బస్సులో నుంచి నన్ను బయటకు తోశాడు కండక్టర్. యూనివర్సిటీ వరకు పాదయాత్ర చేయటానికి నిర్ణయించుకున్నాను. నడుస్తూ నడుస్తూ- శివకాంతా, యూనివర్సిటీ అంతా ప్రతిఘటనలు, ఊరేగింపులు, నిరసనలు జరుగుతున్న వేళ నేను ఒక పిచ్చివాడిలా యూనివర్సిటీకి పది కిలో మీటర్ల అవతల ఒక డివైడర్‌పై పడుకొని వుండటం ఎంత పారడాక్స్ (Paradox)! ఎవరో గుర్తుపట్టి నన్ను హాస్టల్‌కి చేర్చడం- నాకు ఇంకా అంతుపట్టని విషయం. వాళ్లు నన్ను భయపెట్టారా? లేదా, నా పుట్టుకలోనే ఒక భయం వుందా?

యూనివర్సిటీకి బలవంతపు సెలవలు ఇచ్చిన రోజులలో నువ్వు నన్ను సైకియాట్రిస్ట్ ప్రసాదరావు దగ్గరికి తీసుకువెళ్లిన రోజు నాకు గుర్తుంది. ఆయన నా భుజం తట్టి యూ ఆర్ ఆల్‌రైట్ బాయ్ (You are alright boy) అంటూ ఒక స్పైరల్ నోట్‌బుక్ నా చేతిలో పెట్టి నీ ఆలోచనలన్నీ ఈ పుస్తకంలో రాయి. ఆలోచనలు, జ్ఞాపకాలు అన్నీ. ఇదే నీకు ట్రీట్‌మెంట్. మరే మందులు అవసరం లేదు అన్నాడు.

**3**

శివకాంతా, యిన్నాళ్ల తరువాత స్పైరల్ నోట్‌బుక్ తెరిచాను. నలుపు రంగు స్పైరల్ నోట్ బుక్ ఖాళీఖాళీగా, నా ముందర. రోజంతా స్టడీ టేబుల్ ముందే కూర్చుంటాను. పుస్తకం తెరిచినప్పటి నుంచి

ఒక్క వాక్యం కూడా రాయలేదు. ఒకానొక స్థితిలో ఏదో నన్ను ఆవహించినట్లుగా అట్లా శూన్యంలోకి చూస్తాను.

జీవితం ఏమిటి అంటూ వెనుక రోజులవైపు చూస్తాను. ముఖ్యంగా, నా యూనివర్సిటీ రోజులవైపు. నిర్లిప్తమైన దిగులు లాంటి భావన ఏదో నా చుట్టూ. వరుసగా ఐదు రోజుల పాటు స్టడీ టేబుల్, స్పైరల్ నోట్ పుస్తకం. ఖాళీ పేజీలు, ఒకానొక ట్రాన్స్ కోసం ఎదురు చూస్తూంటాను. సమస్తాన్నీ మర్చిపోయి వెనుకకు ప్రయాణించి అక్కడ నిలబడి ఒక యుద్ధకాండను ఒక భీభత్స నాటకాన్ని గుర్తు చేసుకోవాలనీ, ముఖ్యంగా R మరణం, పన్నెండోవాడు ఫిలిప్స్ అదృశ్యం, లైబ్రరీ మెట్ల ముందు బరబరా ఈడ్చిన ఒక దృశ్యంలోకి తిరిగి ప్రయాణించాలని...

సరిగ్గా ఏడవరోజు, ఆ రోజు శనివారం. వీధులలో ఎప్పటిలాగే అరుపులు, కోలాహలం. నినాదాల ప్రతిధ్వనులు, కరుకైన పాదాలు గుండెలపై నుండి పరిగెత్తుతున్న చప్పుడు... 'కొట్టండి, నరకండి, నిషేధించండి'- అరుపులు.

స్పైరల్ నోట్‌బుక్‌లో మొదటి వాక్యం ప్రత్యక్షమైంది. నా యూనివర్సిటీ రోజుల్లోని అతి ముఖ్యమైన సంఘటన R మరణం. వాక్యం తరువాత వాక్యం. స్పైరల్ నోట్‌బుక్‌లో మొదటిపేజీ పూర్తయింది. పదవరోజు సాయంకాలానికి ఒక పుస్తకం పూర్తయింది. పదకొండవరోజు ఉదయం రెండవ పుస్తకాన్ని తెరిచాను. బయట సూర్యకాంతి కిటికీలో నుండి లోపలికి చొచ్చుకు వస్తుంది. అద్దంపై పడి మళ్లీ నా ముఖంపై పడి, అద్దంలో నా రూపం తళుక్కుమని, How it is going GS? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అద్దంలోని GS తల పైకెత్తాడు. ముఖం నిర్లిప్తంగా ఖాళీగా ఉంది. "GS, GS ఆ ఖాళీ ముఖంలో ఏదైనా నింపు." అద్దంలోని GS ముఖంలో స్పందన లేదు.

మరుసటి రోజంతా నోట్‌బుక్ నింపే పనిలోనే. ఈసారి హాస్టల్ గది బయట కాళ్లకు మేకులు, తాళ్లూ కట్టబడ్డ GS కథ. హాస్టల్ బయట వ్యాన్‌లోకి బరబరా ఈడ్చుకు వెళ్తున్న చప్పుడు, మూటల్లాగా, శరీరాలని విసిరివేస్తున్న చప్పుడు, GS... GS ఇది రియాక్ట్ కావలసిన సందర్భం కాదా? GS... GS నా చెయ్యి వణికింది. శరీరం నిండా చెమటలు. రాయడం ఆపి వేసి నోట్‌బుక్‌పై తలనాన్చి, శివకాంతా ఇప్పుడు నువ్వు వుంటే ఎంత బాగుండును. నా తల నిమిరి ధైర్యాన్ని నూరి పోసి, నాలుగు కవిత్వపు వాక్యాలు వినిపించి, GS... GS ఇది నీ కథ. రాయ్ రాయ్ ఇది కథ. రికార్డు చేయ్, రికార్డు చేయ్.

సరిగ్గా 42 రోజుల తర్వాత 4వ స్పైరల్ నోట్‌బుక్ పూర్తి అయింది. చివరి నోట్‌బుక్‌లో యూనివర్సిటీ రోజులు ముగుస్తున్న సమయాలు. చెండ మారుతం ఒక్కటి అటు ఇటు వేడి శ్వాసలను విసురుతున్న సమయం అది. చివరి పేజీ నీ గురించిన ముచ్చటతోనే ముగించాను. శివకాంతా, ఆ సాయంకాలం కాన్వొకేషన్ సభలో VC నుండి డిగ్రీ తీసుకోవడానికి తిరస్కరించిన నీ రూపం నాకు ఇంకా గుర్తుంది. రెండు చేతులూ కట్టుకొని స్టేజిపైన నిలబడి నువ్వక్కడ నిరసన పతాకంలా నిలబడి... మేమంతా చూస్తూనే ఉన్నాం- చివరకు VCతో కాక మరొక గెస్ట్‌తో నీకు డిగ్రీ ఇప్పించడం. 4వ స్పైరల్ నోట్ బుక్‌లో చివరి పేజీ అది.

ఆ రాత్రి రాస్తూ రాస్తూ అట్లాగే స్టడీ టేబుల్‌పై పడుకున్నాను. చీకట్లు ముగిసిన సమయం. రాత్రి రెండవ జాము. వీధులన్నీ నిశ్శబ్దంగా ఉన్న వేళ క్రింద అపార్టుమెంట్‌లో ఎక్కడో తలుపుపై దబా దబామంటూ పెద్ద చప్పుడు. ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. చిన్న పిల్లవాడొకడు 'నాన్న నాన్న...' అంటున్నాడు.

ఒక స్త్రీ నోటికి చీరకొంగు అడ్డు పెట్టుకొని పొగిలి పొగిలి ఏడుస్తోంది. క్రిందకు పరిగెత్తాలని ప్రయత్నించాను. క్రింద అంబులెన్స్

వచ్చిన శబ్దం. స్ట్రెచర్ ఈడుస్తున్న శబ్దం వినిపిస్తుంది. సరిగ్గా అప్పుడే వీధి పక్కనున్న శిక్షణాశిబిరంలో కవాతు శబ్దం. 'మారో మారో...' అంటూ అరుపులు ఎగిసివస్తున్నాయి. 'రోకో రోకో...' అంటూ కేకలు వినిపిస్తున్నాయి.

క్రిందకు పరిగెత్తబోయిన నా కాళ్లకు తాళ్లు బిగుసుకుపోయాయి.

మరుసటిరోజు శనివారం అపార్టుమెంట్ ముందు షామియానా, 4, 5 కుర్చీలు ఒక అకాల మరణం. ఇంటివాళ్లు కాని బంధువులు కాని ఎవరూ మాట్లాడుతున్నట్టు లేదు. ఒక సామూహిక నిశ్శబ్దం. మధ్యాహ్నానికి మళ్లీ శిక్షణాశిబిరంలో కవాతు శబ్దం. నినాదాలు, జెండాలు. శివకాంతా, ఇది ఎంత అబ్సర్డ్ (Absurd) దృశ్యం! నేను ఆ మధ్యాహ్న సమయంలో మన అపార్టుమెంట్ మెట్లు దిగి, షామియానాలోకి నడిచాను. అది అపరిచితుల సభలా ఉంది. ఎవరూ రోదించడం లేదు. అక్కడ ఎవరు నిషేధ ఆజ్ఞలు విధించారో తెలియదు. నేనొక కుర్చీలో కూర్చుని చనిపోయిన మనిషి వైపు చూశాను. శివకాంతా, ఆ క్షణాలు నీకు ఎలా వివరించనూ! ఆ చనిపోయిన మనిషి ముఖం అచ్చం నాలాగే లేదూ! నేను అక్కడ చనిపోయి పడి వున్నట్లు. అక్కడ ఎక్కువసేపు కూర్చోలేదు, భయంతో పరిగెత్తాను. మన అపార్టుమెంట్కి వచ్చి తలుపులు కిటికీలు మూసి చాలాసేపు నా శ్వాస పెనురొదలా గదుల నిండా వినిపిస్తూనే వుంది. నా గుండె చప్పుడు గోడల నుండి తలుపుల నుండి మొత్తం అపార్టు మెంట్ నుంచి వినిపిస్తుంది. స్టడీ టేబుల్ పైన వున్న నాలుగు స్పైరల్ నోట్ పుస్తకాలు నాకు వ్యతిరేకంగా రాయబడ్డ సాక్ష్యాలు.

శివకాంతా, నువ్వు తరచుగా సరెండర్ అంటూ ఒక మాటను వాడుతూ వుంటావు. దాని పూర్తి అర్థం ఏమిటో నా ఎరుకలోకి వచ్చింది. ఆ పగలు, ఆ రాత్రి గదుల నిండా పచార్లు చేస్తూనే వున్నాను. శనివారం రాత్రి 12 గంటల సమయంలో మృత శిశువును చేతులలో

మోసుకు వెళ్తున్న బాలింతలా 4 నోట్ పుస్తకాలతో వీధిలోకి వచ్చాను.

చీకటి, నిర్మానుష్యం. అక్కడక్కడా విరిగిన లాఠీలు, జెండాలు. గోడలపైన భీకరంగా మెరుస్తున్న నినాదాలు. శివకాంతా, ఆ రాత్రి నేను పూర్తిగా ఒక సరెండరర్‌గా మిగిలిపోయాను. 4 నోట్ పుస్తకాలను డస్ట్‌బిన్‌లోకి విసిరివేశాను. కొద్దికొద్దిగా ఊపిరి కదలాడడం మొదలైంది. ఖాళీ అపార్టుమెంట్‌లో అచేతనంగా స్టడీ టేబుల్ పైనే కూలబడి అట్లాగే నిదురపోయాను.

### 3

ఆ వేళ ఉదయం కంటే ముందే నువ్వు తిరిగి వచ్చావు శివకాంత. అపార్టుమెంటు నిండా కళ్లు మిరమిట్లు గొలిపే వెలుగు. పదిగంటల వేళ యూనివర్సిటీ నుండి ఫోన్. జిరాక్స్ తీసిన స్పైరల్ నోట్‌బుక్ కాగితాలు హాస్టల్ నోటీస్ బోర్డుపైనా, లైబ్రరీ గోడలపైన అతికిస్తూ నువ్వు కనబడ్డావని, ఇది ఎలా సాధ్యం?

*పాలపిట్ట మాసపత్రిక*
*నవంబర్ 2016*